సాక్షి
వికారాబాద్
శనివారం । 13 । సెప్టెంబర్ । 2025



వాగులో గల్లంతై..
దిడ్డి వాగు దాటుతూ గల్లంతైన తాండూరు మండలానికి చెందిన మొగులప్ప శుక్రవారం శవమై తేలాడు. 8లో▸



వ్యాపారవేత్తలుగా ఎదగాలి
మహిళలు ఆత్మ విశ్వాసంతో వ్యాపారవేత్తలుగా ఎదగాలని అడిషనల్ కలెక్టర్ సుధీర్ అన్నారు. 8లో▸



రాయితీ యంత్రాలతో మేలు
యంత్రలక్ష్మి పథకం మళ్లీ ప్రారంభం కానుంది. ఇందు కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. 9లో▸

న్యూస్‌రీల్

ఘనంగా ‘గురువందనం’
తపస్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించిన తపస్ నాయకులు

తాండూరు టౌన్: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులను గురువందనం అనే కార్యక్రమం పేరుతో తాండూరులో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హన్మంతరావు, కోశాధికారి లక్ష్మీకాంతరావు తదితరులు మాట్లాడారు. ఉపాధ్యాయ, విద్యారంగంలో నెలకొని సమస్యల పరిష్కారం కోసం తపస్ పోరాటం చేస్తూనే ఉందన్నారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని, దేశ హితం కోసం, విద్యార్థి బంగారు భవిష్యత్ కోసం నిరంతరం తపించే ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు అంజిరెడ్డి, రాములు, ఆనందం, సుభాష్ రెడ్డి, బస్వరాజ్, మాణిక్ రావు, జనార్దన్ రెడ్డి, నరహరి రెడ్డి, వీరేశం, సంతోష్, వినోద్, రవి, సిద్రామేశ్వర్, అనిల్, శ్రీనివాస్, సంతోష, శోభ తదితరులు పాల్గొన్నారు.

15, 16 తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు

అనంతగిరి: వికారాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 15, 16 తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొ. పీవీ గీతాలక్ష్మి పట్నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కొడంగల్‌లో..

కొడంగల్ రూరల్: 2025 -26 విద్యా సంవత్సరానికి రాను ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వివిధ కోర్సుల్లో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బీఏ ఇంగ్లిష్ మీడియంలో 30 సీట్లు, తెలుగు మీడియంలో 76 సీట్లు, బి.కాం కంప్యూటర్ అప్లికేషన్స్‌లో 23 సీట్లు, బీఎస్సీ బీజెడ్‌సీ, జీజెడ్‌సీ.ఎస్ ఇంగ్లిష్ మీడియంలో 31 సీట్లు, తెలుగు మీడియంలో 30 సీట్లు, బీఎస్సీ ఎంపీసీ, ఎంపీసీ.ఎస్‌లో ఇంగ్లిష్ మీడియంలో 46సీట్లు, తెలుగు మీడియంలో 50 సీట్లు ఉన్నాయని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. అర్హత, ఆసక్తి కలిగిన వారు సంబంధిత ధ్రువపత్రాలతో ఈ నెల 15, 16 తేదీల్లో కళాశాలలో సంప్రదించాలన్నారు. రిజర్వేషన్లకు లోబడి అడ్మిషన్లు జరుగుతాయని తెలిపారు.

పరిగి డిగ్రీ కళాశాలలో..

పరిగి: పరిగి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్స్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సునీతాపద్మావతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఈనెల 15,16వ తేదీల్లో హాజరుకావాలని సూచించారు.

స్వదేశీ జాగరణ్ మంచ్ జిల్లా కమిటీ ఏర్పాటు



అనంతగిరి: స్వదేశీ జాగరణ్ మంచ్ జిల్లా కమిటీని శుక్రవారం ప్రకటించారు. జిల్లా కన్వీనర్‌గా భానూర్ మహేందర్‌రెడ్డి, మహిళా కన్వీనర్‌గా సుజాత, పర్యావరణ ప్రముఖ్‌గా ఎల్.మహేందర్‌రెడ్డి, ప్రచార ప్రముఖ్‌గా ప్రేంకుమార్, కోకన్వీనర్లుగా వెంకట్, ఆంజనేయులు, శివశంకర్, భానుప్రకాష్‌ను నియమించారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ పాలమూర్ విభాగ్ సహ కార్యవాహ్ కెరెల్లి అనంత్‌రెడ్డి, స్వదేశీ జాగరణ్ మంచ్ రాష్ట్ర కో కన్వీనర్ ఈశ్వర్ జీ, పాలమూర్ విభాగ్ కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి, విభాగ్ కుటుంబ ప్రబోధక్ ఎలకంటి పురుషోత్తం, వికారాబాద్ కన్వీనర్ సురేష్‌గౌడ్, కృష్ణ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్‌కుమార్‌కు బంగారు పతకం

పరిగి: పరిగి సబ్ జైలు సూపరింటెండెంట్ రాజ్‌కుమార్ బంగారు పతకం సాధించారు. నగరంలోని తెలంగాణ పోలీస్ అకాడమీలో ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు జరిగిన 7వ ఆల్ ఇండియా ప్రిసన్స్ డ్యూటీ మీట్ -2025లో ఫస్ట్ ఎయిడ్ విభాగంలో పాల్గొని బంగారు పతకం గెలుపొందాడు. తెలంగాణ జైళ్ల శాఖ వరుసగా 3వ సారి ఓవరల్ ఛాంపియన్ షిప్ సాధించింది. దేశంలోని 21 రాష్ట్రాలు పాల్గొనగా జాతీయ స్థాయిలో రాజ్‌కుమార్ గోల్డ్ మెడల్ సాధించారు.



ప్రారంభానికి సిద్ధంగా మున్సిపల్ కార్యాలయం



నిర్మాణ దశలో కొడంగల్ ప్రభుత్వాస్పత్రి భవనం

కొడంగల్.. జిగేల్

శరవేగంగా నియోజకవర్గ అభివృద్ధి

- సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో భారీగా నిధులు
- చురుగ్గా రోడ్ల విస్తరణ, ప్రభుత్వ భవన నిర్మాణాలు

కొడంగల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్‌లో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. రూ.10 వేల కోట్లతో వివిధ పనులు చేపట్టారు. వీటిని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పరుగులు పెట్టిస్తున్నారు. విద్య, వైద్యం, రవాణా రంగాలకు సీఎం ప్రాధాన్యత కల్పించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల, వృత్తి విద్యా కళాశాల, ఇంజనీరింగ్, నర్సింగ్, మహిళా పీజీ, డిగ్రీ, జూనియర్ కళాశాలలు, వ్యవసాయ పరిశోధనా కేంద్రాన్ని మంజూరు చేశారు. కొడంగల్‌లో 220 పడకల టీచింగ్ ఆస్పత్రిని నిర్మిస్తున్నారు. కొడంగల్ - నారాయణపేట ఎత్తిపోతల పథకానికి రూ.4 వేల కోట్లు మంజూరు చేశారు. కొడంగల్‌లో రూ.6.80 కోట్లతో ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నిర్మిస్తున్నారు. రోడ్ల విస్తరణకు రూ.344 కోట్లు మంజూరు చేశారు. పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.30 కోట్లు విడుదల చేశారు. సమీకృత గురుకుల విద్యా సంస్థలను (ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్) మంజూరు చేశారు. కొడంగల్, కోస్గిలో రోడ్ల విస్తరణ పనులు చేపట్టారు.



చురుగ్గా కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనులు

ఆదర్శంగా తీర్చిదిద్దుతాం



కొడంగల్‌ను రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతాం. నియోజకవర్గంలో పలు రకాల అభివృద్ధి పనుల కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సుమారు రూ.10వేల కోట్లు మంజూరు చేశారు. వెనుకబడిన ఈ ప్రాంతాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసుకునేందుకు చక్కటి అవకాశం వచ్చింది. ప్రభుత్వ మెడికల్ కళాశాల, నర్సింగ్, ఫిజియోథెరపీ, పారామెడికల్ కళాశాల్లో త్వరలో అడ్మిషన్లు ప్రారంభం కానున్నాయి. మున్సిపల్ కార్యాలయానికి నూతన భవనం నిర్మించాం. క్రీడా ప్రాంగణం, ఇండోర్ స్టేడియం, స్పోర్ట్స్ కోచింగ్ సెంటర్, వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి, సెంట్రల్ లైటింగ్ సిస్టం తదితర పనులు త్వరలో ప్రారంభమవుతాయి.

– తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్

శిథిల భవనాలు

- దెబ్బతిన్న పలు ప్రభుత్వ కార్యాలయాలు
- కూలే దశలో డీఏఓ, ఆర్డీఓ, తహసీల్దార్ ఆఫీసులు
- భయాందోళనలో ఆయా శాఖల ఉద్యోగులు
- నూతన భవనాలకు మంజూరు కాని నిధులు

వికారాబాద్: జిల్లాలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు శిథిలావస్థకు చేరాయి. ఎప్పుడు కూలుతా తెలియని పరిస్థితి నెలకొంది. నూతన భవనాలు, మరమ్మతులకు అధికారులు ప్రతిపాదనలు పంపుతున్నా నిధులు మంజూరు చేయించడంలో ప్రజా ప్రతినిధులు విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వందేళ్ల నాటి భవనంలో ఆర్డీఓ కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. బిల్డింగ్ కాల పరిమితి ముగిసిందని పదేళ్ల క్రితమే అధికారులు నివేదిక ఇచ్చారు.. కానీ అందులోనే ఉద్యోగులు, సిబ్బంది భయం భయంగా విధులు నిర్వహించాల్సి వస్తోంది. ఇటీవల ఆదిలాబాద్ కలెక్టరేట్ భవనం కుప్పకూలిన కూలిపోయిన నేపథ్యంలో ఇక్కడి ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. ఎప్పుడు ఏం జరుగుతుందోనని హైరానా పడుతున్నారు. ఒక్క జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయమే కాదు అనేక భవనాలు శిథిలావస్థకు చేరాయి. ఇందులో కొన్ని చిన్నపాటి వర్షాలకే ఉరుస్తున్నాయి. ఇంకొన్ని పెచ్చులూడి పడుతున్నాయి.

దెబ్బతిన్న కార్యాలయాలు

జిల్లా వ్యాప్తంగా వ్యవసాయశాఖ కార్యాలయాలు శిథిలావస్థకు చేరాయి. వికారాబాద్, పరిగి కార్యాలయాలు అధ్వానంగా మారాయి. వికారాబాద్ ఆర్డీఓ కార్యాలయం, తాండూరు, బషీరాబాద్, వికారాబాద్, పరిగి తహసీల్దార్ కార్యాలయ భవనాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వీటి కాలపరిమితి ముగిసిందని పదేళ్ల క్రితమే ఆర్‌అండ్‌బీ అధికారులు నివేదిక ఇచ్చారు. అయినా వాటిలోనే కార్యాలయాలు నిర్వహించడం ఆందోళన కలిగిస్తోంది. పరిగి తహసీల్దార్ కార్యాలయాన్ని మాత్రం ఇటీవల తాత్కాలిక భవనంలోకి మార్చారు. తాండూరు పశువైద్యశాల, పరిగి ఆర్‌అండ్‌బీ కార్యాలయ భవనం, మార్కెట్ కార్యాలయ భవనాలు శిథిలావస్థకు చేరాయి.

కలెక్టరేట్‌లో లీకేజీలు

కొత్త జిల్లాల ఏర్పాటు అనంతరం వికారాబాద్‌లో సమీకృత కలెక్టరేట్‌ను నిర్మించారు. 2022లో అప్పటి సీఎం కేసీఆర్ దీన్ని ప్రారంభించారు. రూ.60.7 కోట్ల వ్యయంతో నిర్మించిన భవనం రెండేళ్లకే లీకేజీ అవుతోంది. పాల్ సీలింగ్ ఊడి పడుతోంది. పెచ్చులూడి పడుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు పై అంతస్తు నుంచి నీళ్లు కారుతున్నాయి. మరమ్మతు పనులు చేపట్టడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. భవన నిర్మాణ సమయంలో నాణ్యత పాటించకపోవటం వల్లే ఈ దుస్థితి వచ్చిందని ఆయా శాఖల అధికారులు అంటున్నారు.



కాలం చెల్లిన భవనంలో కొనసాగుతున్న వికారాబాద్ ఆర్డీఓ కార్యాలయం



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

ప్రజలతో మమేకం కండి

- ఎస్పీ నారాయణరెడ్డి

బంట్వారం: ప్రజలతో మమేకం కావడంతోపాటు వారితో స్నేహపూర్వంగా మెలగాలని ఎస్పీ నారాయణరెడ్డి సిబ్బందికి సూచించారు. శుక్రవారం కోట్‌పల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేసుల స్థితిగతులపై ధారూరు సీఐ రఘురాములు, స్థానిక ఎస్‌ఐ శైలజకు సూచనలు చేశారు. ఎట్టి పరిస్థితుల్లో కేసులను పెండింగ్‌లో ఉంచరాదన్నారు. నేరం చేసిన వారు తప్పించుకోకుండా దర్యాప్తు చేయాలని తెలిపారు. పోలీసు వ్యవస్థ పట్ల ప్రజలకు నమ్మకం కలిగేలా మరింత చేరువ కావాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకొని అవసరం ఉన్న సమయంలో ఉపయోగించాలని అన్నారు. నేరాల నియంత్రణకు ముందస్తు ప్రణాళిక రూపొందించుకొని అందుకు అనుగుణంగా పెట్రోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. నిత్యం వాహనాలను తనిఖీ చేయా లని తెలిపారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే అదుపులోకి తీసుకొని పూర్తి సమాచారం సేకరించాలని ఆదేశించారు. అక్రమ రవాణా, వ్యా పారులపై నిఘాను పటిష్టం చేయాలని తెలిపారు. సమస్యలు సృష్టించే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని, అవసరమైతే రౌడీ షీట్స్ ఓపెన్ చేయాలని సూచించారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా సీసీ కెమరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన విద్యార్థులు

- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలంటూ భారీ ర్యాలీ
- తాండూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన
- మద్దతు పలికిన బీజేపీ, బీఆర్‌ఎస్, ఏబీవీపీ నాయకులు

తాండూరు టౌన్: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలంటూ విద్యార్థులు రోడ్డెక్కారు. ర్యాలీగా వెళ్లి సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విద్యార్థులకు బీజేపీ, ఏబీవీపీ, బీఆర్‌ఎస్ నాయకులు, ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్య సంఘం నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్ కుమార్, బీసీ కమిషన్ రాష్ట్ర మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు చెల్లించడం మరిచి పోయిందని ఎద్దేవా చేశారు. విద్యాశాఖ తన వద్దే పెట్టుకున్న సీఎం రేవంత్‌రెడ్డికి విద్యార్థుల బాధలు పట్టడం లేదని ఆరోపించారు. పేద, మధ్య తరగతి, గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఉన్నత చదువుల కోసం పూర్తిగా ఫీజు రీయిబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లపైనే ఆధారపడి చదువుతున్నారని పేర్కొన్నారు. ఏళ్ల తరబడిగా బకాయిలు విడుదల చేయక పోవడంతో ప్రైవేటు కళాశాలలు మూసి వేసే పరిస్థితి దాపురించిందన్నారు. విద్యా రంగాన్ని నిర్వీర్యం చేసే యోచనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే బకాయిలు విడుదల చేయాలని లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.



తాండూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థులు

కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు మాధవ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్, నాయకులు భద్రేశ్వర్, సాహు శ్రీలత, మల్లేశం, బీఆర్‌ఎస్ నాయకులు భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ కొండాకు వినతి

ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయించాలని తాండూరు ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యం, బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డికి తాండూరులో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి చెల్లించక పోవడంతో కళాశాలలు మూత పడే ప్రమాదం ఏర్పడిందన్నారు. ఇది పరోక్షంగా ఉన్నత చదువులు చదవాలనుకునే గ్రామీణ ప్రాంత విద్యార్థులపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుందన్నారు. ప్రభుత్వంతో మాట్లాడి వెంటనే నిధులు మంజూరయ్యేలా చూడాలని ఎంపీని కోరారు.

హేయమైన చర్య

సాక్షి పత్రిక, జర్నలిస్టులపై అక్రమ కేసులు నమోదు చేయడాన్ని హేయమైన చర్యగా వివిధ సంఘాల నేతలు అభివర్ణించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైఖరి సరికాదని, పత్రికా స్వేచ్ఛను హరించొద్దని హితవు పలికారు. జర్నలిస్టుల ఇళ్లు, కార్యాలయాల్లో సోదాల పేరుతో పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదన్నారు.



దాడులు సరికాదు



ఏపీ ప్రభుత్వం పత్రికల గొంతు నొక్కాలని చూస్తోంది. ఇలాంటి వాటిని ఎవరూ హర్షించరు. ప్రజా సమస్యలను వెలుగులోకి తెస్తున్న జర్నలిస్టులపై దాడులు చేయడం హేయమైన చర్య. ప్రజల కోసం.. ప్రజాస్వామ్యం కోసం పాటుపడే మీడియా ఎంతో కీలకం. అలాంటి దాన్ని కట్టడి చేయాలని చూడటం సరికాదు.

– ఎండీ ఫరీద్, న్యాయవాది, తాండూరు

ప్రజాస్వామ్యంపై దాడి



ఏపీ ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛను హరిస్తోంది. రైతాంగ సమస్యలపై జరుగుతున్న ఉద్యమాలను వెలుగులోకి తేవడం తప్పా..?. ప్రభుత్వం పత్రికలను గుప్పిట్లో పెట్టుకోవాలని చూస్తోంది. ఇందులో భాగంగానే అక్రమ కేసులు పెడుతోంది. ఏపీలో జరుగుతున్న అప్రజాస్వామిక చర్యలను పూర్తిగా వ్యతిరేకిస్తున్నాం.

–బుగ్గప్ప, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు

సమాజం హర్షించదు



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మీడియా స్వేచ్ఛను కాలరాస్తోంది. జర్నలిస్టుల గొంతు నొక్కడమంటే ప్రజా హక్కులను హరించడమే. నిర్బంధాలు, దాడులతో వాస్తవాలను దాచలేరు. పత్రికా స్వేచ్ఛను కాపాడాలి. ఏపీ కూటమి ప్రభుత్వ చర్యలను సమాజం హర్షించదు.

– వై.గీత, ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి

పత్రికా స్వేచ్ఛను హరించడమే



సాక్షి దినపత్రిక, ఎడిటర్, జర్నలిస్టులపై ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం కేసులు పెట్టడం పత్రికా స్వేచ్ఛను హరించడమే. ఆర్టికల్ 19 ప్రకారం ప్రతి ఒక్కరికీ భావప్రకటన స్వేచ్ఛ ఉంటుంది. ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలను వెలుగులోకి తేవడం తప్పా..?. ఇవి ముమ్మాటికీ తప్పుడు కేసులే. ప్రజల పక్షాన పనిచేసే జర్నలిస్టుల గొంతు నొక్కాలని చూడటం సరికాదు.

– ముకుంద నాగేష్, టీజేఏసీ చైర్మన్, వికారాబాద్

విలువలు కాలరాయడమే



సాక్షి దినపత్రిక, ఎడిటర్, పాత్రికేయులపై దాడులు, అరెస్టులు చేయడం ప్రజాస్వామ్య విలువలను కాలరాయడమే. ఇలాంటి వాటిని ప్రతి ఒక్కరూ తప్పుపట్టాల్సిందే. అక్రమ అరెస్టులు, బెదిరింపులు మంచివికాదు. ప్రజాస్వామ్యంలో పత్రికాస్వేచ్ఛ చాలా ప్రధానమైనది. దీన్ని హరించడం మంచి పద్ధతి కాదు. ఆధారాలు లేకుండా కేసులు పెడితే ప్రజల ముందు నిలబడవు.

– ఆర్.మైపాల్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు

పారదర్శకత పాటించండి

- రైతులకు ఇబ్బంది లేకుండా యూరియా పంపిణీ చేయాలి
- జిల్లా వ్యవసాయాధికారి రాజరత్నం

కొడంగల్ రూరల్: యూరియా పంపిణీలో పారదర్శకత పాటించాలని, రైతులకు ఏ మాత్రం ఇబ్బంది లేకుండా చూడాలని జిల్లా వ్యవసాయాధికారి రాజరత్నం ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని పీఏసీఎస్ గోదాంను తనిఖీ చేసి పలు అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం రుద్రారం గ్రామ రైతు వేదికలో యూరియా పంపిణీని పరిశీలించారు. రైతుల ఆధార్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకాలు పరిశీలించి యూరియా అందజేయాలని ఆదేశించారు. ఇప్పటి వరకు 10 మెట్రిక్ టన్నులు పంపిణీ చేసినట్లు వివరించారు. అనంతరం ఎరువుల నిల్వ, పంపిణీపై వ్యవసాయ విస్తరణ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఏడీఏ శంకర్‌రాథోడ్, మండల వ్యవసాయాధికారి జి.తులసి, పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్‌గుప్తా, ఏఈఓ శ్రీపతి, పీఏసీఎస్ సీఈఓ రఘుపతి, ఇన్‌చార్జ్ అక్బర్ పాల్గొన్నారు.

రైతులందరికీ యూరియా అందించాలి

దుద్యాల్: రైతులందరికీ సమానంగా యూరియా అందించాలని జిల్లా వ్యవసాయాధికారి రాజరత్నం సూచించారు. శుక్రవారం మండలంలోని హస్నాబాద్ రైతు వేదికలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో రైతులకు 220 బస్తాల యూరియా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ప్రతి రైతుకూ యూరియా అందించాలని సూచించారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి నాగరాజు, ఏఈవోలు రేణుక, జ్యోతి ఉన్నారు.



రైతుల ఆధార్ కార్డు, పట్టా పాసుపుస్తకాలు పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

క్లుప్తంగా

మహిళలకు కుట్టుమిషన్ శిక్షణ

కుల్కచర్ల: ఎస్‌బీఐ రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు నేర్పించనున్నట్లు ఆ సంస్థ ఉమ్మడి జిల్లా సంచాలకులు మహ్మద్‌అలీ ఖాన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వికారాబాద్, రంగారెడ్డి జిల్లాలలోని మహిళలందరికీ ఉచితంగా కుట్టుమిషన్లు నేర్పిస్తామని, ఆసక్తి ఉన్న మహిళలు 85001 65190, 95506 06019 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఈ నెల 15వ తేదీ నుంచి శిక్షణ కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. 18 ఏళ్ల నుంచి 45 ఏళ్లలోపు మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల రికవరీ



బాధితుడికి ఫోన్ అందజేస్తున్న కానిస్టేబుల్ శ్రీశైలం

దుద్యాల్: మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామానికి చెందిన నాయికోటి శ్రీకాంత్, కుదురుమల్ల గ్రామానికి చెందిన సున్నపు దస్తప్ప వేర్వేరు ప్రాంతాల్లో తమ సెల్‌ఫోన్లను పోగొట్టుకున్నారు. వీరు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఈఐఆర్ పోర్టల్ సహకారంతో మొబైల్స్ గుర్తించి కానిస్టేబుల్ శంకర్, శ్రీశైలం శుక్రవారం బాధితులకు అందజేశారు.

యువతి పెళ్లికి కానుక

రూ.1.11లక్షలు అందజేసిన కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆయుబ్ అన్సారీ



నగదు అందజేస్తున్న అయూబ్ అన్సారీ

బంట్వారం: కోట్‌పల్లి మండలం కరీంపూర్‌లో ఓ యువతి వివాహానికి కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆయుబ్ అన్సారీ రూ.1.11లక్షలు అందజేశారు. వివరాలలోకి వెళితే.. కరీంపూర్‌లో ఆడపిల్ల వివాహానికి రూ.1.11లక్షలు, యువకుడికి రూ.51,100 వివాహ కానుక ఇస్తానని ఇటీవల ప్రకటించారు. శుక్రవారం గ్రామంలో కావలి రాజు చైతన్యకుమారి దంపతుల కూతురు శ్రీవర్ధిని వివాహానికి రూ.1.11లక్షల నగదును యువతి తల్లిదండ్రులకు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

త్రుటిలో ప్రాణాపాయం నుంచి బయటపడిన రైతు



ఎద్దు కళేబరం

ధారూరు: పశుగ్రాసం మేస్తున్న ఎద్దు విద్యుదాఘాతంతో మృత్యువాత పడింది. ఈ సంఘటన శుక్రవారం మండల పరిధిలోని జీడిగడ్డ తండా సమీప వ్యవసాయ పొలంలో చోటుచేసుకుంది. నేనావత్ రాములునాయక్‌కు చెందిన ఎద్దు మేతమేస్తూ రోడ్డు పక్కనే ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లింది. విద్యుదాఘాతంతో కొట్టుకుంటుండగా రైతు దగ్గరా వెళ్లేందుకు యత్నించాడు. గమనించిన సమీపరైతులు అడ్డుకోవడంతో ఆయన ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. ఎద్దు విలువ సుమారు రూ.70వేలు ఉంటుందని ప్రభుత్వమే తమను ఆదుకోవాలని రైతు కోరాడు.

గణితఫోరం అధ్యక్షుడిగా శ్రీధర్‌రెడ్డి



బషీరాబాద్: గణిత ఫోరం తాండూరు నియోజకవర్గం అధ్యక్షుడిగా జీవన్గీ పాఠశాలకు చెందిన శ్రీధర్‌రెడ్డి ఎన్నికయ్యారు. శుక్రవారం తాండూరు నంబర్-1 పాఠశాలలో నియోజకవర్గ గణిత ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ గణిత ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తానన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు గణిత ఫోరం ఆధ్వర్యంలో సదస్సులు నిర్వహించి క్విజ్‌లు, పోటీ పరీక్షల ద్వారా గణిత మెలకువలను నిర్వహిస్తామన్నారు. డిసెంబర్ 22న శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా నియోజకవర్గ స్థాయిలో పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర రిసోర్స్ పర్సన్ వీరేశం, జిల్లా రిసోర్స్ పర్సన్లు, గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూరియా దందా.. రైతన్న బెంగ

- అన్నదాత అవసరాన్ని ఆసరా చేసుకుంటున్న ఫెర్టిలైజర్ దుకాణం
- అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్న యజమాని
- ఒక్కో బస్తాకు అదనంగా రూ.80 వసూలు
- ఫిర్యాదు చేసిన రైతులు
- విచారణ చేపట్టిన వ్యవసాయాధికారులు



సాయిధనలక్ష్మి ఫెర్టిలైజర్ దుకాణంలో విచారణ చేపడుతున్న ఏఓ అనిత

బషీరాబాద్: రైతుల యూరియా ఇబ్బందులను ప్రైవేట్ ఎరువుల దుకాణాదారులు సొమ్ము చేసుకుంటున్నారు. అధిక ధరలకు విక్రయిస్తూ బిల్లులు ఇవ్వకుండా మోసం చేస్తున్నారు. ఒక్కో బస్తాకు రూ.80 చొప్పున వసూలు చేస్తున్న విషయం ఆలస్యంగా వెలుగుజూసింది.

లేబర్ లేకున్నా చార్జీలు వసూలు

మండల పరిధిలోని నావంద్గీ సహకార సంఘం, సాయిధనలక్ష్మి ఎరువుల దుకాణం నుంచి రైతులకు యూరియా విక్రయిస్తున్నారు. సొసైటీలో ప్రభుత్వ ధరకు విక్రయించడంతో రైతులు పెద్ద ఎత్తున బారులు తీరుతున్నారు. రైతులకు సరిపడా యూరియా అందడం లేదు. మండల కేంద్రంలోని సాయిధనలక్ష్మి ఫెర్టిలైజర్ దుకాణానికి బుధవారం 22 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని తెలుసుకున్న రైతు లు అక్కడకు చేరుకున్నారు. ప్రభుత్వం 45 కేజీల యూరియా బస్తాకు రూ.266.50 ధర నిర్ణయించింది. ఇదే అదునుగా భావించిన సాయిధనలక్ష్మి ఎ రువుల దుకాణ యజమాని ఒక్కో బస్తాకు రూ.320–రూ.350 వరకు వసూలు చేశారు. రైతులు అడిగినా బిల్లులు ఇవ్వలేదు. యూరియా బస్తాలు రైతులే మోసుకుని ఆటోలు, జీపుల్లో వేసుకున్నా వారికి కూడా లేబర్ చార్జీల పేరిట బస్తాకు రూ.6 చొప్పున అదనంగా వసూలు చేసినట్లు రైతులు ఆరోపిస్తున్నారు. ఇదే విషయాన్ని పలువురు రైతులు మండల వ్యవసాయాధికారిని అనితకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆమె శుక్రవారం దుకాణానికి వెళ్లి తనిఖీలు చేపట్టారు. ఓ రిజిస్టర్‌లో రైతుల పేర్లు, ఆధార్ నంబర్లు, ఫోన్ నంబర్లు రాసుకున్నట్లు గుర్తించారు. ఒక్క రైతుకు బిల్లులు ఇవ్వలేదని వ్యవసాయ అధికారిణి ప్రాథమిక విచారణలో తేలింది.

రెండు బస్తాలకు రూ.640 చెల్లించా



వారం రోజులుగా యూరియా బస్తాలకు కోసం తిరుగుతున్నా. సొసైటీలో బస్తాకు రూ.270 ఉందని అక్కడ ప్రయత్నిస్తే దొరకలేదు. సాయిధనలక్ష్మి ఫెర్టిలైజర్ షాపులో బుధవారం రెండు బస్తాలు కొంటే రూ.640 తీసుకున్నారు. బస్తాలు ఆటోలో నేనే వేసుకున్నా రూ.6 చొప్పున లేబర్ చార్జీలు వసూలు చేశారు. ఈ విషయంపై అధికారులకు ఫిర్యాదు చేశాం.

– గోవర్ధన్‌రెడ్డి, రైతు, జీవన్గీ

రైతులను దోచుకుంటే సహించం



అధిక ధరలకు యూరియా విక్రయిస్తే ఊరుకోం. సాయిధనలక్ష్మి ఎరువుల దుకాణం వారు ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నట్లు రైతులు ఫిర్యాదు చేశారు. ఇదే విషయాన్ని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. కష్టకాలంలో రైతులను దోచుకుంటూ ప్రభుత్వాన్ని అబాసుపాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. – మాధవరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్

లైసెన్సు రద్దు చేస్తాం



యూరియా కొరత ఉన్నందున ప్రైవేటు ఫెర్టిలైజర్ షాపుల్లోనూ విక్ర యాలకు ప్రభుత్వం అ నుమతిచ్చింది. బషీరాబాద్‌లోని సాయిధనలక్ష్మి ఫె ర్టిలైజర్ షాపులో రూ.320 నుంచి రూ .350 వ రకు ఒక్కో బస్తాను బిల్లులు ఇవ్వకుండావి క్రయించినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. బాధిత రైతులు నుంచి ఫిర్యాదులు తీసుకుని దు కాణం లైసెన్సు రద్దు చేయడంతో పాటు కేసు లు నమోదు చేస్తాం. – కొమురయ్య, ఏడీఏ, తాండూరు

పౌర సేవలపై ప్రత్యేక దృష్టి

- అభివృద్ధి పనుల్లో అలసత్వం వీడాలి
- కొత్తగా విధుల్లో చేరిన మున్సిపల్ ఉద్యోగులు పారదర్శకంగా పనిచేయాలి
- తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీఎంఆర్

తాండూరు: మున్సిపల్ పరిధిలో అధికారులు పౌర సేవలపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలు పరిష్కరించాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ యాదగిరి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ స్వప్నపరిమళ్‌లతో కలిసి మున్సిపల్ అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధిలో పారిశుద్ధ్యంపై ఫిర్యాదులు విరివిగా వస్తున్నాయని అసహనం వ్యక్తం చేశారు. వార్డులలో ప్రతీ రోజు చెత్త సేకరణ, మురుగు కాల్వలు శుభ్రం చేయించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. మరమ్మతులకు గురైన వాహనాలను వెంటనే బాగు చేయించాలన్నారు. వార్డుల వారీగా అధికారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. మున్సిపల్ పరిధిలో అక్రమ నిర్మాణాలను అరికట్టాలని పలువురు నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయన్నారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే టౌన్ ప్లానింగ్ సిబ్బంది మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ భూములను కబ్జాకాకుండా కాపాడాలన్నారు.

అభివృద్ధి పనులు వేగిరం

వర్షాల కారణంగా మున్సిపల్ పరిధిలో అభివృద్ధి పనులు నిలిచిపోయాయని తగ్గిన వెంటనే పనులు వేగిరం చేస్తామన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మరో రూ.50 కోట్లతో చిలుకవాగు ప్రక్షాళన పనులు పూర్తి చేస్తామన్నారు. లారీ పార్కింగ్ కోసం ట్రాన్స్‌పోర్టు అసోసియేషన్ నిర్వాహకులు ఒక్కొక్కరు దుకాణాల కోసం రూ.10 లక్షలు కడితే టీఎస్‌ఐఐసీ లారీ పార్కింగ్‌తో పాటు దుకాణ సముదాయాలు నిర్మించి ఇస్తారని చెప్పిన ముందుకు రావడం లేదన్నారు. నాపరాతి పాలిషింగ్ యూనిట్‌లను జినగుర్తి పారిశ్రామిక వాడకు తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

ఆలయ కమిటీ తీర్మానమే ఫైనల్

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనుల్లో ఆలయ కమిటీ తీర్మానమే ఫైనల్.. దుకాణదారులు నిర్మాణ పనులకు సహకరించాలని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని భావిగి భద్రేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో పాత దుకాణాలను తొలగించి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను చేపడుతున్నారు. పలువురు దుకాణదారులు ఖాళీ చేయకపోవడంతో పనులకు అంతరాయం కలుగుతోంది. ఈవిషయమై ఆలయ కమిటీ అధ్యక్షుడు పటేల్ కిరణ్‌తో పాటు కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే శుక్రవారం కమిటీ సభ్యులతో కలిసి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను పరిశీలించారు. దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ కమిటీ తీర్మాణం మేరకే నిర్మాణ పనులు జరుగుతాయని స్పష్టం చేశారు. దుకాణం ఎంత విస్తీర్ణంలో ఉంది. నిర్మాణ పనులు సైతం అంతే స్థలంలో జరుగుతాయన్నారు. ఏమైన అనుమానాలు ఉంటే నిర్మాణ పనులు జరుగుతున్న సమయంలో ప్రైవేటు ఇంజినీర్లను పెట్టుకొని సర్వే చేయించుకోవాలని ఎమ్మెల్యే దుకాణదారులకు తెలిపారు. దుకాణం ఖాళీ చేసిన ప్రతి ఒక్కరికి దుకాణాలు కేటాయిస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ రవిగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, నాయకులు తదితరులున్నారు.

బాలిక కిడ్నాప్ కేసులో..

బాలుడి తల్లిదండ్రులకు రిమాండ్

కుల్కచర్ల: ప్రేమ పేరిట బాలికను కిడ్నాప్ చేసిన ఘటనలో బాలుడి తల్లిదండ్రులను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ రమేశ్ తెలిపిన ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన బాలికను.. అదే కాలనీకి చెందిన బాలుడు గత ఏప్రిల్ 10న అపహరించుకు వెళ్లాడు. ఇందుకు బాలుడి తల్లిదండ్రులు రాజమ్మ, సత్తయ్య సహకరించారని, బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని నిర్ధారించిన పోలీసులు శుక్రవారం బాలుడి తల్లిదండ్రులను రిమాండ్‌కు తరలించారు. మైనర్ల ప్రేమ, పెళ్లి వ్యవహారాల్లో సహకారం అందిస్తే పోక్సో కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

స్తంభించిన రాకపోకలు

ధారూరు: కాగ్నానదితో పాటు మండలంలోని వాగులన్నీ శుక్రవారం నిండుగా ప్రవహించాయి. గట్టెపల్లి గ్రామ అడవిలోని బాలోనికుంట నిండి పెద్ద చెరువులోకి వరద పారింది. ఈ నీరు తట్టెపల్లితండా రోడ్డుపై ఉధృతంగా ప్రవహించడంతో ధారూరు– గట్టెపల్లి, గట్టెపల్లితండాల మధ్య రాకపోకలు స్తంభించాయి. తప్పని పరిస్థితిలో కొంతమంది రుద్రారం మీదుగా వచ్చివెళ్లారు.

కల్లాల్లోని పంట వరదపాలు!



రాంపూర్‌తండాలో కొట్టుకుపోయిన వేరుశనగ పంట

ధారూరు: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండల పరిధిలోని పలువురు రైతులు సాగు చేసిన పంటలు పాడవుతున్నాయి. రాంపూర్‌తండా గిరిజనులు సాగుచేసిన వేరుశనగ పంట దెబ్బతింది. వరుస వర్షాలతో మూడు రోజులుగా పొలాలకు వెళ్లని రైతు శుక్రవారం పంటను చూసి కన్నీటి పర్యంతమయ్యారు. సుమారు యాభై ఎకరాల్లో కోసిన వేరుశనగ పంట కల్లాలనుంచి కొట్టుకుపోయింది. అధికారులు స్పందించి ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా చూడాలని బాధితులు వేడుకుంటున్నారు.

స్కూటీ డిక్కీలోంచి నగదు చోరీ

శంకర్‌పల్లి: బ్యాంకులో నగదు డిపాజిట్ చేసేందుకు వెళ్లిన ఓ వ్యక్తిని.. క్యూలైన్ కొంప ముంచింది. ఈ ఘటన శుక్రవారం శంకర్‌పల్లిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని హనుమాన్ నగర్‌కి చెందిన ప్రమోద్ గౌడ్(25) పట్టణంలో ఓ ల్యాబ్‌లో టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ఉదయం ఆయన తల్లి డ్వాక్రా సంఘానికి సంబంధించిన రూ.2.97లక్షల డబ్బులను యూనియన్ బ్యాంకులో డిపాజిట్ చేయమని చెప్పింది. మధ్యాహ్నం బ్యాంక్‌కు వెళ్లగా క్యూలైన్ ఎక్కువ ఉంది. దీంతో ల్యాబ్‌లో పనిచేసుకుని వద్దామని నగదును స్కూటీలో పెట్టుకుని వెళ్లాడు. 15నిమిషాల తర్వాత బయటకి వచ్చి చూడగా నగదు మాయమైంది. దీంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

బాల్యవివాహాల నిర్మూలనకు కృషి చేయాలి



అనంతగిరి: పురోహితులు, ఖాజీలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న రమేశ్ యాదవ్



పరిగి: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నర్సింలు

సాధన ఎన్జీఓ జిల్లా కోఆర్డినేటర్ రమేశ్ యాదవ్

అనంతగిరి: సమాజంలో బాల్యవివాహాలను నిర్మూలించేందుకు అన్ని మతాల పెద్దలు కృషి చేయాలని సాధన ఎన్జీఓ జిల్లా కోఆర్డినేటర్ రమేశ్ యాదవ్ అన్నారు. శుక్రవారం వికారాబాద్ అనంత పద్మనాభ స్వామి ఆలయం, జిల్లా కేంద్రంలోని పలువురు పురోహితులు, ఖాజీలతో బాల్య వివాహాల నిర్మూలనలో భాగంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జిల్లా కోఆర్డినేటర్ రమేశ్ యాదవ్ మాట్లాడుతూ.. బాల్య వివాహాల రహిత సమాజ నిర్మాణంలో భాగంగా ప్రపంచ వ్యాప్తంగా 39 దేశాల్లో ప్రతిజ్ఞ కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. జిల్లాలో బాల్యవివాహాలను నిర్మూలించేందుకు ప్రతీ ఒక్కరు ముందుకు రావాలన్నారు. బాల్యవివాహాలతో ప్రసూతి, శిశు మరణాలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బాల్య వివాహాల నిర్మూలనకు పురోహితులు, పాస్టర్లు, ఖాజీలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు నర్సింలు, జి.రమేశ్, రోజా, పురోహితులు, ఖాజీలు తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణకే షీటీం

పరిగి: మహిళలపై జరుగుతున్న దాడుల నియంత్రణకు షీటీం పనిచేస్తుందని షీటీం ఇన్‌చార్జి నర్సింలు అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని శ్రీ సాయి ఒకేషనల్ కళాశాలలో షీటీం నిర్వహణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులపై, మహిళలపై ఎక్కడ ఎలాంటి ఘటనలు జరిగిన వెంటనే షీటీం నంబర్ 181కు కాల్ చేసి సమాచారం అందించాలని సూచించారు. బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు లేదా డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ఆన్‌లైన్ మోసాలు జరుగుతున్నాయని తమ తల్లిదండ్రులకు ఆన్‌లైన్, బ్యాంకింగ్ మోసాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీశైలం, షీ టీం సిబ్బంది పాల్గొన్నారు.

వాగులో గల్లంతై.. శవమై తేలాడు

- మృతదేహంతో బంధువుల ఆందోళన
- ప్రకృతి విపత్తు సాయం కింద రూ.5 లక్షల చెక్కు అందజేసిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి
- కాంట్రాక్టు ఉద్యోగం ఇప్పిస్తామని హామీ



మొగులప్ప మృతదేహాన్ని వాగులోంచి తీసుకొస్తున్న ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది



మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

తాండూరు రూరల్: దిడ్డి వాగు దాటుతూ గల్లంతైన వ్యక్తి శవమై తేలాడు. మండల పరిధిలోని సంగెంకలాన్‌కు చెందిన భుక్తంపల్లి మొగులప్ప(47) గురువారం చెట్టినాడు ఫ్యాక్టరీ–సంగెంకలాన్ మధ్యలో దిడ్డి వాగు దాటుతూ కొట్టుకుపోయిన విషయం విదితమే. గురువారం రాత్రి వాగు ఉధృతంగా ప్రవహించడంతో సహాయక చర్యలకు ఆటంకం కలిగింది. తాండూరు ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ జలేంధర్‌రెడ్డి, మహబూబ్‌నగర్ ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది 16 మందితో శుక్రవారం గాలింపు చర్యలు చేపట్టారు. రెండు కిలోమీటర్ల దూరంలో మృతదేహాన్ని గుర్తించి గ్రామానికి తీసుకువచ్చారు. దీంతో మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు తమకు న్యాయం చేయాలని కోరుతూ మృతదేహంతో ఆందోళన చేపట్టారు. మాజీ సర్పంచ్ మేగనాథ్‌గౌడ్, డీసీసీబీ వైస్ చైర్మన్ రవిగౌడ్ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ప్రకృతి విపత్తు సాయం కింద రూ.5లక్షల విలువైన చెక్కును మృతుడి భార్య లలితమ్మకు అందజేశారు. చెట్టినాడు సిమెంట్ ఫ్యాక్టరీ ప్రతినిధులు భీంరెడ్డి, సతీశ్‌రెడ్డితో మాట్లాడి కాంట్రాక్టు ఉద్యోగం ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. రైతుబీమా కింద రూ.5లక్షలు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. దిడ్డివాగుపై తాత్కాలిక బ్రిడ్జి ఏర్పాటు చేయిస్తామన్నారు. అనంతరం మృతదేహానికి తాండూరు ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి అంత్యక్రియలు చేశారు. ఈ సహాయక చర్యల్లో తహసీల్దార్ తారాసింగ్, ఆర్‌ఐ గోపి, ఎంపీఓ వీరప్ప, పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ, ఎస్‌ఐ రాథోడ్ వినోద్ కానిస్టేబుళ్లు, నాయకులు శ్రీను, నాగప్ప, ధారాసింగ్, ఉత్తమ్‌చందు, రాజేందర్‌రెడ్డి, సంజీవ్‌రెడ్డి ఉన్నారు.

యువకుల దాడిలో గాయపడిన వ్యక్తి మృతి



అంజిలయ్య (ఫైల్)

ధారూరు: యువకుడిలో దాడిలో గాయపడిన వ్యక్తి ఆరోగ్యం క్షీణించి శుక్రవారం మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని నాగారంలో చోటు చేసుకుంది. మృతుడి కుటుంబీకులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన నీరటి అంజిలయ్య అలియాస్ ఆంజనేయులు(45), భారతమ్మ దంపతులు గ్రామంలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వహించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఆగస్టు 13న యాలాల మండలం రాస్నం గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు వచ్చి నూడుల్స్ ఆర్డర్ చేశారు. ఆయిల్ తక్కువగా ఉందని నిర్వాహకులతో సదరు యువకులు గొడవకు దిగారు. మారణాయులతో దాడికి దిగారు. వీరిని అడ్డుకునేందుకు వచ్చిన గ్రామానికి చెందిన అమర్‌నాథ్‌పై సైతం దాడి చేసి హోటల్ ఫర్నిచర్ ధ్వంసం చేశారు. ఈ దాడిలో అంజిలయ్య, భారతమ్మ తీవ్రంగా గాయపడ్డారు. భారతమ్మ మెడలోని మూడున్నర తులాల బంగారు పుస్తెల తాడును లాక్కెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు బండరి కృష్ణ, అనంతయ్యపై కేసు నమోదు చేసి బైండోవర్ చేశారు. వీరి దాడిలో గాయపడిన అంజిలయ్య మంచాన పడి ఆరోగ్యం క్షీణించి శుక్రవారం మృతి చెందాడు. తన భర్త మృతికి కారణమైన నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ భారతమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది.

జర్నలిజానికి సంకెళ్లు.. ప్రమాదకరం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్‌కుమార్



తాండూరు: ప్రజాస్వామ్యంలో పత్రికల పాత్ర చాలా కీలకమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యు.రమేశ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. జర్నలిస్టులను రాజకీయ కక్షసాధింపులకు గురిచేయడం సమాజానికి మంచిది కాదన్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తేవడంతో పాటు ప్రభుత్వ లోటుపాట్లు తెలియజేసే జర్నలిజానికి సంకెళ్లు వేయాలనుకునే ధోరణి ప్రమాదకరమని తెలిపారు. ప్రభుత్వాలు.. పత్రికలు నిర్మాణాత్మక దృక్పథాన్ని కలిగి ఉండాలన్నారు. అప్పుడే ప్రజల్లో విశ్వసనీయత దక్కుతుందని స్పష్టంచేశారు. ఆంధ్రప్రదేశ్‌లో జర్నలిస్టులపై దాడులను ఎవరూ అంగీకరించడం లేదన్నారు.

కూటమి ప్రభుత్వ తీరు అప్రజాస్వామికం

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పీర్ మహమ్మద్



దోమ: ఆంధ్రప్రదేశ్‌లో సాక్షి మీడియాపై కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న తీరు అప్రజాస్వామికమని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పీర్ మహమ్మద్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పాటై రెండేళ్లు కావస్తున్నా ప్రజా సంక్షేమాన్ని పక్కనపెట్టి, మీడియాపై దాడులకు తెగబడటం సరికాదన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతిఒక్కరికీ ప్రశ్నించే హక్కు ఉంటుందని, ఆ దిశగా సాక్షి ముందుకు సాగడంలో తప్పేముందని ఏపీ సర్కారును ప్రశ్నించారు. కథనాలు, వార్తల్లో ఏవైనా అవాస్తవాలు, లోటుపాట్లు ఉంటే వివరణ, సంజాయిషీ కోరవచ్చని తెలిపారు. కానీ కేవలం కక్ష సాధింపు ధోరణితో కేసులు బనాయించడం పత్రికాస్వేచ్ఛకు భంగం కలిగించడమేనని పేర్కొన్నారు. సాక్షి దినపత్రిక ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డితో పాటు జర్నలిస్టులపై కేసులు పెట్టడం బాధాకరమని తెలిపారు. ఇప్పటికైనా ఇలాంటి చర్యలను ఆపకపోతే ప్రజాగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు.

మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ సుధీర్

అడిషనల్ కలెక్టర్ సుధీర్

అనంతగిరి: మహిళలు ఆత్మ విశ్వాసంతో వ్యాపారవేత్తలుగా ఎదగాలని అడిషనల్ కలెక్టర్ సుధీర్ అన్నారు. శుక్రవారం వికారాబాద్ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వీ హబ్ ఆధ్వర్యంలో జిల్లా స్వయం సహాయక సంఘాలు, మహిళా పారిశ్రామికవేత్తలకు ఉమెన్ యాక్సిలరేషన్ ప్రోగ్రాంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతోందన్నారు. ఏటా బ్యాంకుల ద్వారా పెద్ద మొత్తంలో రుణాలు అందించడం జరుగుతోందన్నారు. వాటిని మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థిక ప్రగతి సాధించాలని సూచించారు. అనంతరం డీఆర్‌డీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ.. స్త్రీనిధి కింద ఏటా రూ.610 కోట్ల రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. వీ హబ్ డైరెక్టర్ జాహిద్ షేక్ మాట్లాడుతూ.. టెక్స్‌టైల్స్, ఫుడ్ ప్రాసెసింగ్, హస్తకళలు వంటి రంగాల్లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వీ హబ్ అసోసియేట్ డైరెక్టర్ శ్రీ ఊహ, పరిశ్రమల శాఖ జీఎం మహేశ్వర్, వీ హబ్ ప్రాజెక్ట్ మేనేజర్ తాజ్, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సాయిరాం, అడిషనల్ డీఆర్‌డీఓ నర్సింలు, మెప్మా పీడీ రవికుమార్, డీపీఎం కొమరయ్య, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు జానకి, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

బీహార్ ఎన్నికల కోసమే జీఎస్టీ తగ్గింపు

మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

ఇబ్రహీంపట్నం: బీహార్ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కేంద్రం ప్రభుత్వం జీఎస్టీ తగ్గించిందని.. ప్రజలపై మమకారంతో కాదని మాజీ ఎమ్మెల్సీ, సీపీఎం జాతీయ నాయకుడు నర్సిరెడ్డి విమర్శించారు. సీపీఎం జాతీయ మాజీ కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఇబ్రహీంపట్నంలోని ఆ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి మనుధర్మ శాస్త్రం అమలుకు కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. మోదీ ప్రభుత్వం దోపిడీ వర్గాలకు కొమ్ముకాస్తోందన్నారు. ఇందుకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని విమర్శించారు. సీతారాం ఏచూరి బ్రాహ్మణ కుటుంబంలో జన్మించి అట్టడుగువర్గాలకోసం పనిచేసిన గొప్ప నాయకుడని కొనియాడారు. ఆయన ఆశయసాధనకు ప్రతిజ్ఞ కృరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, కార్యదర్శివర్గ సభ్యులు సామేల్, నర్సింహ, జగన్, సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, రావుల జంగయ్య, అంజయ్య, నర్సింహ, సీహెచ్ జంగయ్య, సీహెచ్ బుగ్గరాములు, పి.జగన్, ఎల్లేశ్, పురుషోత్తం, వెంకటేశ్, రాజు, విఘ్నేశ్, శారద, అరుణ తదితరులు పాల్గొన్నారు.